
చెప్పవలసినవన్నీ పనివాళ్ళకి చెప్పేసి; టౌన్వెళ్ళిపోదామని రోడ్డు పక్కని నిలబెట్టిన జీపులో డ్రయివర్ సీటులో యెక్కి కూర్చుంటున్నాను. ఇంతలోకే "నమస్కారం సార్" అని కొత్త గొంతుతో పలకరింపు. జీపుపక్కనే సైకిల్ ఆగడం— దానిమీంచి "సింహాచలం" దిగడం-




# 'సర్వే జనాః సుఖినోభవంతు'

భమిడిపాటి రామగోపాలం

వెనక నేను సర్వేడిపార్ట్మెంట్లో పని చేసినప్పుడు పొలాలూ, స్థలాలూ కొలవడానికి వుపయోగించే గొలుసు పట్టుకుంటూ వుండిన చైన్మన్ల్లో ఒకడు- సింహాచలం.

"ఏంట్రోయ్ సంగతి?" అన్నాను మొహానికి నవ్వు పులుముకుని.

"పెందుర్తి బంగళాకాడ మా యినస్పెట్రు సుబ్బారావుగోరు క్యాంపు సార్- ఆరితో వొచ్చామండి నీనూ అప్పల్స్వామీనీ—"

"ఊహూ."

"బాగున్నారా సార్ తమరూ, అమ్మగారూ, అమ్మాయిగారూ?"

"మరే రా. సుబ్బారావుగారున్నారా, బంగళాలో?"

"బంగళాకాడ నేరండి. అయిస్కూలు జాగవ లున్నరండి."

"అక్కడేమిటుంది కొత్త?"

"కొత్త గాదండి...." నవ్వాపుకోలేక పోయాడు సింహాచలం. "చయికిలింగు నేరుస్తన్రండి."

సుబ్బారావుగారు, నేను సర్వే డిపార్ట్మెంట్లో వున్నప్పుడు నాకు పై అధికారి. నేను డిప్యూటీ సర్వేయర్గా చేరినప్పటికి ఆయన సర్వేయర్. నేను సర్వేయర్గా ప్రమోషన్ తెచ్చుకునే నాటికి ఆయనకి హెడ్ సర్వేయర్ ప్రమోషనొచ్చింది. నేను సర్వేయర్గా వున్నప్పుడే ఆయన "ఇన్స్పెక్టర్" కూడా




అయ్యాడు. ఈ లోపుగా నాకు అందులో విసుగుపుట్టి గొట్టపు బావుల తవ్వకం కంట్రాక్టులు తీసుకుంటూ ఆ వుద్యోగం మానేశాను. ఆయనకి నలభయ్యేళ్ళు దాటుంటాయి.

హైస్కూలు గ్రవుండ్స్‌లో సుబ్బారావుగారు సైకిలు తొక్కడం నేర్చుకుంటున్నారు ... ముందు హాండిల్ ఒక "చైన్‌మన్" పట్టుకున్నాడు. వెనకాల సీటూ కారేజీ కలిపి ఇంకోడు-సర్కస్‌లో గొడుగు పట్టుకుని వైరుమీద నడిచే అమ్మాయిలా ఊగుతూ, తూగుతూ పెడలింగ్ చేస్తున్నారు సుబ్బారావుగారు.

సుబ్బారావుగారు వ్యక్తిగా "చాలా మంచాయన". తన సిబ్బందిని "క్రింది వాళ్ళుగా" కాక, "తోటి వాళ్ళుగా" చూసే వాడు.

'సర్వే' ఉద్యోగం చెయ్యడానికి గొడ్డులా కష్టపడగలగడం ప్రధానం. రెండోది చక్కని దస్తూరి, ముచ్చటైన అంకెలు. మూడోది- కరణంగారి అరుగు మీదగానీ. మున్సబుగారి పశువుల కొట్టంలో గాని, పాత్రుడుగారి కళ్ళాల్లోగానీ— ఓపిగ్గా వంట చేసుకుని సుష్టుగా భోజనం చెయ్యగలగాలి.

"శీతల జలక స్నానము
భూతల శయనంబు. ఒంటిపూట అశ
నంబున్.
నాతిగల బ్రహ్మచర్యము—" అని

వాచ్చే చాటు పద్యానికి నాలుగో చరణంగా—

"నాతరమా సర్వేపార్టీ నౌకరిచేయనే" అని కలిపి దాన్ని సర్వేకి అనువర్తితం చేసింది సుబ్బారావుగారే.

అలా, "నాతరమా. సర్వే సాగర మీదను. నళినదళేక్షణ రామా" అనుకోకండా సుబ్బారావుగారుతాను స్వయంగా కష్టపడుతూ తను నిర్దేశించిన విధంగా కష్టపడగల ప్రతి ఒక్కర్నీ అభిమానించే వాడు- అది గదాధర పట్నాయక్‌గానీ, చార్లెస్ ఓబడుగానీ, సయ్యద్ అహమ్మద్ గానీ—

ఎంత దూరమైనాసరే, నడిచెయ్యడమే ఆయన కలవాటు. "బస్సుంది సార్, ఇంకో గంటలో" నంటే. "ఆ గంటసేపట్లోనూ నాలుగు మైళ్ళు నడవచ్చు. ఆ తరవాత ఎలాగూ నాటు దారేకదా. ఆ మాత్రం దానికి బస్సెక్కడంయెందుకూ? పదండి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడుద్దాం—" అనేవాడాయన. ముందుగా అడుగేస్తూనూ.

ఇప్పటి కథకాదిది—

1958 నాటిది—

అప్పటికింకా విశాఖపట్నంలో కాల్టెక్స్ ఆయిల్ రిఫైనరీ పూర్తిగా పని మొదలెట్టలేదు. కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఊహలోనే వుందింకానూ. బి. హెచ్. పి. వి. లేదు. జింకు లేదు. సూపర్‌బజార్లు లేవు. షాపింగ్ కాంప్లెక్సులసలే లేవు.

విశాఖపట్నం నుంచి చోడవరానికి శృంగవరపు కోటకి. అనకాపల్లికి, విజయనగరానికి— ఈ పెందుర్తి నాలుగురోడ్ల జంక్షన్ ద్వారా రోజుకి రెండేసి బస్సులిటూ, రెండు అటూనూ. మళ్ళా పొద్దు పోయేలోగా అవే వెనక్కి రావాలి. అందుకే సుబ్బారావుగారు నడక మేలనే వాడు.

అలాంటి సుబ్బారావుగారికి నలభై ఏళ్ళు వెళ్ళేక సైకిల్ తొక్కడం నేర్చుకోవలసొచ్చిందా?

"కీళ్ళ నొప్పులా?" అని అడిగాను.

"కీళ్ళ నొప్పులూ లేవు. కాళ్ళ నొప్పులూ లేవు. అంతా రాత!"

"మీ రాత బాగానే వుంటుందికదా!"

"చేతిరాత బాగానే వుంటుంది కాని తలరాతే యిలా తగలడుతోంది. ఎప్పటి కప్పుడు! లేకపోతే అరవయ్యోయేట అగ్నిగండం అన్నట్టుగా ఇదేమిటి చెప్పు నాకీ పాట్లు?"

జేబులోంచి ఒక కాగితం తీసిచ్చాడాయన. అది నేను మడత విప్పేలోగా అటు తిరిగి "ఒరే. ఈ పూటకి చాలిద్దాంరా.... మధ్యాన్నం మళ్ళా వొద్దాం. సన్నిబాబూ, నందయ్యా మీరు ఈ పూట వొచ్చేరుకదా. మధ్యాన్నం సింహాచలం. అప్పలస్వామీ వస్తాను."

"అయ్...."— "చిత్తం...."— "అలగే బాబు" అంటూ తలలూపుతూ వెళ్ళారు వాళ్ళు ముగ్గురూనూ.

"రా, బంగళా కెద్దాం" అని నన్ను లాగాడు సుబ్బారావుగారు.

"భోజనం పెడతారా?" అన్నాను నవ్వుతూ.

"ఓ! అదెంతభాగ్యం?"


"నిజంగానే నండోయ్ గురూగారూ. హాస్యం కాదు.... మీ చేతి భోజనం రుచి చూసి యన్నాళ్ళయిందో! సర్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పోగొట్టుకున్న మహద్భాగ్యాల్లో అదొకటి!"

"పోవయ్యా మరీ వెక్కిరిస్తావు! సర్వే ఉద్యోగంలో భాగ్యాలాహటాని బాధలే. అన్నీను!.... నడు నడు!.... ఎంతక్కొన్నావీ జీపు?.... నువ్వే నడిపేస్తున్నావా?" అంటూ జీపెక్కి కూర్చున్నాడు.

"ఆఁ నేనే— డ్రయివరున్నాడనుకోండి. ఐనా నాకు సరదా."

* * *

"ఏఁటేటీ, గోపాళంగారే?" అంటూ బంగళాలోకి చేరక ముందే జీపు చప్పుడు




విని మళ్ళీ ఏ మొగుడొచ్చాడో అనుకుంటూ కాబోలు పరుగులాంటి నడకతో ఎదురొచ్చిన రామచంద్రరాజుగారు పలకరించారు.

రామచంద్రరాజుగారు మా అందరికన్నా వయసులో పెద్దవాడు. కాని ప్రాథమిక విద్య తప్ప అర్హత లేకపోడాన్ని సర్వేయర్ గానే మిగిలిపోయాడు. అయితేయేం? ముస్సద్దీ రాత, ముద్దులొలికే అంకెలు! కొత్త కొల్చాదంటే 'లింకు' తేడా రాదు!

"అద్దిగదీ.... ఈ జీపేటి. ఈ యట్ట హాసమేటి. చెప్పరేగాము!.... మొత్తానికి మా డిపాత్మెంటొదిలి బాగుపడ్డారెండి మీరైనా!"

"ఈ జీపులాంటిది పొద్దుటే దొరికుంటే యెంత బాగుణ్ణోకదా" అన్నారు సుబ్బారావుగారు.

* * *

ఆ ఉదయం-

తెల్లారగట్ల మూడింటికి విజయనగరంలో రైలెక్కి, పెందుర్తిలో దిగి, సరాసరి నాలుగురోడ్ల జంక్షన్ దగ్గిరికి నడిచొచ్చేసిన ఆఫీసరు- (అసిస్టెంట్ డైరెక్టర్ అంటారతన్ని, ఉద్యోగపరంగా) బంగళాలో తన కొడలిపెట్టిన భాగంలో ప్రవేశించి; ఇన్స్పెక్షన్ వేపగుంట గ్రామంలోనని ప్రకటించాడట.

సరేకదా అని; ఉన్న బంట్రోతుల్లోనూ చైన్‌మన్ల్లోనూ కాస్త దిట్టమైనవాళ్ళని గొలుసులూ క్రాస్‌స్టాఫ్‌లూ, జెండాలూ సుత్తీ సేనాం వగైరా యిచ్చి వేపగుంట పంపించేసి, ఒక ముసలి ప్యూన్ని కాఫీ హోటల్నుంచి ఇడ్డెన్లుతెమ్మని పుర్మాయించి మరో కీళ్ళవాత ప్పీనుగని వేణ్ణీళ్ళు కాగబెట్టమని కూచోబెట్టి; కాలకృత్యాలు తీర్చుకున్నారట రామచంద్రరాజుగారూ, సుబ్బారావుగారూనూ.

అరున్నర కాకుండానే నాలుగురోడ్ల జంక్షన్ కొచ్చి విశాఖపట్నం వెళ్ళే బస్సులకోసం చూస్తే-

ఇంకేముందీ? ప్రతి బస్సులోనూ కిక్కిరిసి జనం. నిలబడ్డవాళ్ళు. వేళ్ళాడేవాళ్ళు-టాప్‌మీద కూర్చున్నవాళ్ళూనూ.

"వాటీజ్ దిస్? ఈ ప్రేకినస్పెక్టర్లూ, ఆర్ టీవోలూ నిద్దరోతున్నారా? ఏమిటీ అరాజకం?" అని వీళ్ళమీద కేకలకి తగులుకున్నాడట- సర్వే డిపార్ట్‌మెంట్ ఆఫీసరు.

"సార్, ఇవాళ సింహాచల పుణ్యక్షేత్రంలో చెందనయాత్ర సార్. అంచేత సార్, అటువేపు వెళ్ళే బస్సులూ రైళ్ళూ కంపల్సరిగా ఇలా రద్దీగానే ఉంటాయండి సార్!"

"మరైతే యలా వెళ్ళడం; ఇన్స్పెక్షనుకి?"

"జట్కా యార్పాటు చేస్తాన్సార్."

అని సుబ్బారావు పక్కకి జారుకోబోగా,

"ఆగు!" అని గద్దించి; "ఏంటనుకుంటున్నావు నా గురించి నీ మనసులో? నేను,అసిస్టెంట్ డెరెక్టరాఫ్‌సర్వేని; నాలుగువందల యాభైమంది సిబ్బంది మీద ఏకైక అధికారిని; జట్కాలో ప్రయాణం చెయ్యమంటావా?" అని జట్‌లా విరుచుకుపడ్డాడట-

"సార్: మరేం చేయమంటార్సార్: బస్సులన్నీ ఇవాళల్లా ఇలాగే ఉంటాయి సార్" అని సుబ్బారావు బిక్కమొహం వెయ్యగా;

"మన ముగ్గురికీ మూడు సైకిళ్ళు బెత్తాయించండి. వెళ్దాం!" అని ప్రసన్నులయ్యేరట; ఆఫీసరుగారు.

కాని, సుబ్బారావుగారికి సైకిల్ తొక్కడం రాదు.

రాజుగారు పెద్దవాడు. తనొక్కడే అయితే ఎలాగో ఈడుస్తాడుగానీ,'డబుల్స్' లాభం లేదు-

"నాన్సెన్స్!ఎవడయ్యా మీకీ ఉద్యోగాలిచ్చింది?" అని అగ్నిరుద్రుడైపోయి, ఆఫీసర్ నడిరోడ్డుమీద నానా గంతులూ వేసేసి; అల్లంత దూరాన్న నిలబడి ఇటు చూస్తే ఏం తప్పో అన్నట్టుగా పరధ్యానం నటిస్తున్న బంట్రోతుని అంతకంటే భీకరమైన అరుపుతో పిల్చి; వాడి చేతిలో ఉన్న మూటలోంచి కాగితాలు పూడ పెరికి; అప్పటి కప్పుడు అక్కడికక్కడ ఒక 'మిమో'రాసిచ్చేడు సుబ్బారావుగారికి.

"అందింది" అని రాయించి సంతకం తీసుకున్నాడు.

"ఇందుమూలంగా తెలియజేయడమేమనగా, మన విజయనగరం సర్వే పార్టీ నెంబర్ ఫోర్‌లో ఎగ్జిక్యూటివ్ (బయట తిరిగి పనిచేసే) ఉద్యోగుల్లో కొందరికి సైకిల్ తొక్కడంరాదని దిగువ సంతకం చేసినవారి దృష్టికి తీసుకురాబడింది. ఇది చాలా పెద్ద లోటు; గొప్ప వెలితి. కనుక; శ్రీ వి. సుబ్బారావు అనే ఇనస్పెక్టర్ నెంబర్ టూ; ఈ మిమో అందిన ఇరవై నాలుగు గంటలులోగా సైకిల్ తొక్కడం నేర్చుకున్నట్టు మాకు ధృవపడకపోతే ఈ విషయం రెవెన్యూ బోర్డుకి రిపోర్టు పంపి; సదరు సుబ్బారావును హెడ్ సర్వేయర్‌గా రివర్షన్ చెయ్యమని సిఫార్సు చేయబడుతుంది"- అని; ఆ మిమో.

అలా మిమో ఇచ్చిందేకాక-

"సాయంకాలం లోపుగా సైకిల్ తొక్కుతూ కనిపించేవో సరేసరి; లేకపోతే నా సంగతెరుగుదువుకదా! రేపు తెల్లారి ఆరుగంటలకి ఇక్కణ్ణించే రిపోర్టు పంపేస్తా నేమనుకున్నావో!" అని ముఖస్తంగా కూడా హెచ్చరించి-

"అదుగో. ఆ బస్సు ఖాళీగా వెడుతోంది. దాంతో నేను అనకాపల్లి వెళ్ళిపోతాను. అనకాపల్లి తాసిల్దార్‌తో నాకు రెండు మూడు ఫైళ్ళమీద డిస్కషన్ ఉంది." అని చెప్పేసి; "ఎక్కు అప్పల్స్వామీ; ఆ బస్సెక్కు!" అని గదమాయించి అదే పోక-

* * *

అంతా విని,పకపకా నవ్వాను."గొప్ప యముడే దొరికాడు మీకు; గురుగారూ."

సుబ్బారావుగారు కుంపటిమీద ఉడుకుతున్న కూర దించి; పోపు పెట్టడంలో పడ్డాడు.

"ఇక్కడే కాదండి. ఇలా రెండు మూడు పోట్ల యెగిరెగిరి పడ్డాడండీయన; సైకిల్ తొక్కడం రానోళ్ళమీద కిందమీదు డిశంబర్లోగావాల; శ్రీకాకుళం జిల్లా రాజాంలో క్యాంపేసి; పొందూరు దగ్గిర సిరిపురానికి పదిమైళ్ళు సైకిలుమీద పయనమయ్యాడండి. నేనండి. మొయిద సింహాచెలం గారండి. మరే. సామిరాజండి. అల్లాడు లేదండి,సివరాం పట్నాయకండి. ఇంత మంది ఉన్నన్నరండి- ఏటీ; బంట్రోతులు పది మందికాక; మేమంతాను-

సామిరాజు లేదండీ; పొట్టి పంతులు- ఇంగ్లాండ్ రాలీ తీసేదండి. అది జూసి ఈయనగారు సంబరపడిపోయి. ఆ సైకిల్ నేను తొక్కుతాను; నువ్వేరే సైకిలుచ్చుకురా అని- రూపాయ తీసిచ్చాదండి సామిరాజుకి. ఇంక అతగాడు జేసేదేముందండి! సామిరాజు అద్దె సైకిల్కెదొచ్చాదండి.

ముందేమో యే.డీ. గారు రైటమని ఎల్తన్నరండి. మేం యెనక పాలో అయిపోతన్నమండి. వావిలివలస పొలిమేర్లో చెరువు గట్టుంది గదండి; అంది మీద సైకిల్ తొక్కుతూ ఏ.డీ.గారు పడ్డారండి సైకిలుమీంచి పడి గట్టుమీద పట్టుదొరక్క గట్టంటే జారిపోయి ఉడుపుచేను గట్టుదాకా దేకిరీశరండి. అయ్యయ్యో అంటే అయ్యయ్యో అనుకొని మేం అందరం టకటకా సైకిళ్ళకి స్టాండ్లేసి దిగెళ్ళి ఆయన్ని లెగదీశామండి ఆయన తొక్కిన సైకిలు ఇటుకాసి దొర్లిపోయింది గదండి. దానికోసం స్వామిరాజుగారేమో పాంటు ఎగ్గట్టి గట్టు అరగడికి దిగి వింపాదిగా సైకిల్ని గట్టెక్కించాదండి.ఎంత ఇంగ్లాండ్ రేలీ అయితేమటుకు మణిశంత మణిసి పడిపోయి సైకిల్ దొర్లిపోతే హేండిల్ బెండవదా! అదికది అర్థంకాక సైకిలు కేటో అయిపోయిందనుకుని ఎర్రిమొగం ఏసేసినాడు. ఓ కుందవయ్యా పొట్టి పంతులూ అలాన్జెప్పి; ముందు చక్రరి రెండుకాళ్ళ మద్దిని పెట్ చేసి. హేండిల్ వొంపు తీర్చి వొప్పగించినాను. ఆ సమయంలో యేవైందోమరి. మొయిద సింహాచలంగారికి నవ్వుమని నవ్వొచ్చిసిందండి.దాంతో యే.డీ.గారు అగ్గిపోర్రైపోయి ఇంగిలీషులో తగులుకున్నరండి."

జరిగిన సంఘటన కొంత నవ్వు పుట్టించేది; దానికితోడు రామచంద్రరాజుగారి కథనం ధోరణి-

కాసేపు గట్టిగానే నవ్వుకున్నాం-

రాజుగారు కానిచ్చాడు- "నా కింగిలీషు రాదు గాదండి. ఏ డీ. గారన్న మాటలకి అర్థం నేను కనిపెట్టేశానండి-నాకొడకల్లారా, నేను జమ్ జమామని ముందు సైకిల్‌మీదొస్తూ. పరిశిపాటులేని దార్లో పడిపోతేమటుకు నన్జూసి నవుతార్రా! మీకెన్ని గుండెల్రా యెదవల్లారా! ఎడ్క్వార్టర్స్ కెళ్ళిండి; మీ సంగ తేలుస్తాను! మీ తోకలు కోశేత్తా నేమనుకున్నారో" అనేదో అనుంటాడండాయన.

-సరే. ఈ కోపం బుర్రలో పెట్టుకొని సిరిపురం ఇన్‌స్పెక్షన్‌లో ఏం బొక్కలెడతాడో; అసలే పన్నెండుఖండాల గ్రామం.ఇన్‌స్పెక్షన్ రిజర్వ్ పెట్టాడంటే రికార్డెళ్ళదు- అందుకని నేను ముందుకెళ్ళి సార్ తమకి సింహాచలం చెప్పేడో లేదో గానీ. కిందటినెల్లో సిరిపురం ఫస్టు ఖండం ఫైనలినస్పెక్షను కెళ్లేటప్పుడు మన సింహాచెలంగారు కూడా సరిగ్గా యిక్కడే సైకిలు మీంచి పడిపోయారండి-అనిచెప్పానండి. దాంతో యే.డీ గారు కూలైపోయి సైకిల్ తొక్కడమంటే యేంటి; అదెంత గొప్ప విద్య: ఎంత మంచి ఎక్సర్‌సయిజు: ఇయన్నీ లెక్చరిచ్చి. ఆయనగారు సైకిల్ పందాల్లో గెలవడం అయన్నీ కతలు జెప్పుకొచ్చేడండి."

మళ్ళీ కాసేపు నవ్వుకున్నాం.

సుబ్బారావుగారు వంట పని పూర్తి చేసి వేదాంత ధోరణిలో పడ్డాడు. "అసలు నాకు ప్రత్యేకంగా మెమో ఇచ్చింది ఇవాళే అయినా. అసలిలాగ; అందరికీ సైకిల్ తొక్కడం రావాలని ఆర్నెల్లనాడే సర్క్యులర్‌గా రూపొందించి యిచ్చారయ్యా. అప్పుడు నేను అసలు సెలవులో ఉండిపోడాన్ని మనకీ బేరం యిప్పుడు తగిలింది! అప్పుడు డ్యూటీలో ఉండుంటే ఈ పిడుగు పడకముందే ఆ తంటాలు పడుందును!"

"ఆ సర్క్యులరిచ్చిన కొత్తలోనండీ—" రాజుగారు చెప్పాడు! "పాలకొండ తాలూకా ఉగరాడ. చాటాయవలస, ఉప్పరినాయుడు వలస, వెన్నెల గ్రామాల్లో నన్ను ఫెంపరరీగా ఇన్‌స్పెక్షన్ల కేశారండి. ఓ రోజు ఈయనగారు ఉగరాడ మెట్లదగ్గిర బస్సు దిగుతాననీ. అక్కణ్ణించి ఈ ఉల్లోపు గ్రామాల్లోకి సైకిళ్ళమీద ఎళదామనీ కబురెట్టారండి. వారికోసం ప్రత్యేకంగా ఉగరాడ సావుకారొకాయన్నడిగి సైకిల్ తెచ్చామండి.



అయితే ఇంతలోకి. కామేశ్వర శర్మ లేడండీ. అతగాడు 'సార్, ఈ సైకిల్ తమరు తొక్కండి సార్' అంటూ తన బి.యస్పీ.బండి అందించాడండీ. యేటిఅది అతగాడు పెళ్ళిలో పేచీపెట్టి మామగారిచేత కొనిపించిన కొత్త సైకిలండి.సరే ఆయన అదీ ఈయ ఏదీ యెక్కారండి. ఇహ జూసుకోండి ఈ శర్మ తొక్కుతున్నది ఎటువు సైకిల్ గదండి గడికి కరకర్లాడ తది; తుంచేపటికి జజజలాడ్తాది. డౌన్ దిగేతప్పుడికి చైన్ జారిపోయిందండి. అలాగలాగ అతగాడు ఎనక్కుండ పోయాడు. ఏ.డీ.గారు సైకిలాపి యనక్కి తిరిగి. "ఏటి, శర్మగారు ఎనక్కుండి పోయార"న్నాడు. అందరు అటు దిక్కు చూస్తూ నిలబడిపోయాం. శర్మగారు దగ్గిరాగానే "ఏటయ్యా ఎనక్కెనక్కి వస్తున్నావు, సైకిలు కొత్తేటి?" అనడి గారండి. దానికి శర్మగారు పెళ్ళికూతుర్లాగ సిగ్గుపడిపోతూ "మరేండిసార్ తమరు పర్కులర్ యిచ్చేరని నేర్చుకున్నాన్సార్" అన్నాడండి. దాంతో యే.డీ.గారు ఐపై పోయి."మై గుడ్ బోయ్; అలాగుండాలి!" అని అతగాడి బుజం మీద తట్టి: "మరటు వంటప్పుడు నివ్వు కొత్తసైకిల్ తొక్కు" అన్జెప్పి తమ పాత సైకిల్ తీసుకొన్నా డండి."

"అవునూ: మన సర్వే పార్టీకి జీపు ఉండాలికదా." అన్నాను.

"సరి-రా!" అన్నాడు విసుగ్గా, సుబ్బా రావుగారు "అదెప్పటి జీపయ్యా బాబూ! రెండో ప్రపంచయుద్ధం ప్రారంభించి నప్పటిది. శత్రురాజ్యాల వాడెవరో వాడి లేస్తే యుద్ధరంగం లోంచి దాన్ని బ్రిటిష్ గవర్నమెంటువాళ్ళు జాగ్రత్తగా తెచ్చి వొప్పచెప్పిన బాపతు. అన్నెల్లు రోడ్డుమీద వుంటే ఏడాది వర్క్‌షాపులో ఉంటుంది. ఇప్పటికి పదహారు నెల్ల నుంచీ షెడ్లోనే వుంది. దీన్ని వేలం వేసేసి కొత్త జీపు కొనుక్కుంటాం పర్మిషనూ శాంక్షనూ యిమ్మని రాశారు."

"మరి డ్రయివర్ పోస్టు పర్మనెంటు కాబోలు—"

"డ్రయివరూ మిలట్రీ నుంచొచ్చిన వాడే. వాడు డ్రైవ్ చెయ్యడానికి బండేదీ లేక ఈయన్ని బస్ స్టాండ్ దాకానూ, రైలు స్టేషను దాకానూ "డ్రైవ్

## నాగరీకం

జుట్టు తువ్వాల్లో
చెవులు రెండర్థాల పాటల్లో
కళ్ళు మళయాళం సినిమాల
వాల్‌పోస్టర్లలో
పెదవులు సిగరెట్ల ముద్దుల్లో
నాలుక బీరుగ్లాసు చివరిచుక్కల్లో



చేతులు సినిమాపత్రికల పుటల్లో
కాళ్ళు డిస్కో వాద్యాల లయల్లో
మునిగి తేలుతున్నాయి.
గుండె మాత్రం
సంప్రదాయం సంప్రదాయం అని
కొట్టుకుంటోంది.

—సుధామ

చేస్తూంటాడంతే." అని సుబ్బారావుగారు నవ్వాడు.

* * * *

నెల రోజులు కాలేదింకాను.

గొట్టపు బావులు తవ్వించడం కాంట్రాక్టులు చేసుకుంటూ విశాఖ పట్నంలో ఉండి పరిసరగ్రామాలకి అలా తిరుగుతూనే వున్నాను. పెందుర్తి జంక్షన్‌కి చుట్టూరా బోలెడువని. అటు మంగలిపాలెంనుంచి వేపగుంట వరకూ, ఇటు సొంట్యాంనుంచి సబ్బవరంవరకూ అలా పన్లు వస్తూనే ఉన్నాయి. ఆ హైస్కూల్ గ్రౌండ్సు పక్కనుంచి వెడుతున్నప్పుడల్లా సుబ్బారావుగారు సైకిల్ నేర్చుకోడం సంఘటన గుర్తొచ్చి కులాసా కలుగుతూనే వుంది.వినోదిస్తూనే ఉన్నాను.

ఒకటి మాత్రం నిజం. సుబ్బారావు గారు ఈ మాట కనిపిస్తే నడుస్తూ మాత్రం కనిపించడు. అది నిజం. వాహ నంలో సుఖమే అలాంటిది!

సైకిల్ తొక్కేవాడు సోడా తాగడానికి కిళ్ళీ కొట్టుదగ్గర ఆపుతాడు గానీ, దిగడు. స్కూటర్ ఆ సామి బజారు కెళ్ళినా స్కూటర్ తీస్తాడు, బహిర్భూమి కెళ్ళా లన్నా స్కూటరే తీస్తాడు. అంతెందుకు? రిక్షాతొక్కే సైడితల్లికూడా బేరం లేక పోతే సరదాగా ట్రాఫిక్ సెంటర్లలో రౌండ్లు కొడతాడు తప్ప చెట్టుకింద కూచుని బీడీ కాల్చుకోడు.

ఆ రోజు జిల్లాబోర్డు ఇంజనీర్ గారికీ, నాకూ ఏదో వాసనలాంటిది వచ్చింది. విసుక్కొంటూ వచ్చేశాను. హాస్పిటల్ దవున్లో పోలీసు క్వార్టర్స్ వేపు సుబ్బా రావుగారు నడుస్తూ నా కెదురొస్తూ కనిపించారు.

తక్కుమని సడెన్ బ్రేకేసి జీపాపాను.

"అమ్మయ్య: నువ్వటయ్యా: కాన్నా ళ్ళకి!" అని పలకరించారాయనే.

"ఇదేంటి సార్, నడుస్తున్నారు? ఏదో అద్దెసైకిల్ తీసుకుని తొక్కుతూ కని పిస్తారని చూస్తున్నాను:" అన్నాను.

చాలా విశాలంగా నవ్వాడు సుబ్బారావు గారు. "అది సరేలేగాని; నన్ను నీ జీపులో ఎక్కించుకుని హాస్పిటల్లోకి అర్జంటుగా తీసుకెళ్ళాలయ్యా."

"ఎంత దూరం వుంది కనక? నడిచి వెళ్ళలేరు?— అందులో మీలాంటి వాకింగ్ టైగర్?"

"వేళాకోళానికి టైంలేదు. పదకొండు దాటిపోయింది టైము. ఆయనగారికి పది న్నర— పదకొండు లోపునే భోజనం అలవాటు—" అని బతిమిలాడే ధోరణిలో పడ్డాడాయన.

"ఆయనా? అంటే?"

"అదేనయ్యా బాబూ, మా ఏ.డీ. గారు! ఇప్పుడందరూ అతన్ని సైకిల్ స్పెషలిస్టు అని వేళాకోళం చేస్తున్నారు పాపం!"

"పాపమా? ఏం?"

"చచ్చిపోవాల్సింది గదయ్యా........ సరే; ఇంతకీ నువ్వు వస్తావా, లేదా?"

"ఔను బాబూ, దొరగోరికి వాన్నానికి నేటైపోతంది" అంటూ ఎక్కణ్ణించొచ్చేడో, అప్పలస్వామి ఓ చేతిలో కారియరూ, రెండో చేతిలో అరిటాకు చుట్టా.

"సరే, రండి........ అయితే ఏమిటి,

మీ ఏ డీ. గారు సైకిల్ తొక్కుతూ ఏ లారీకిందైనా పడి హాస్పిటల్లోగాని చేరాడా యేమిటి?" అన్నాను.

మూడువారాలైందిట ఆనాటికి—

చోడవరం తాలూకా, వెంకన్నపాలెంలో క్యాంపు: అనకాపల్లి తాలూకా గ్రామాల సర్వే. గెజిటెడ్ ఆఫీసరు ఫైనల్ ఇన్‌స్పెక్షన్లు. ఆ రోజు తుమ్మపాలలో ఇన్‌స్పెక్షను.

మామూలే— సైకిళ్ళు తియ్యమన్నాడు సర్వేశ్వరరావుగారు; అదే. సర్వే పార్టీ అసిస్టెంట్ డైరెక్టర్‌గారు.

రెండుమూడు మైళ్ళవరకు బాగానే వెళ్ళారు.

'తన వెంటన్ సిరి లచ్చి వెంట అవరోధవ్రాతమున్' అన్నట్టు-

ముందు సర్వేశ్వర్రావుగారు-

వెనక ఒక ఇన్‌స్పెక్టరూ, ఇద్దరు హెడ్ సర్వేయర్లు-

ఆ వెనక ఇద్దరేసి డిప్యూటీ సర్వేయర్లు—సర్వేయర్లు-

వాళ్ళవెనక ఏ పదిమందో, చెయిన్‌మన్లు, ప్యూన్లు.

ఆ ఉదయమే సుబ్బారావు గారిమీద చిరాకుపడ్డాడు; ఏమిటి, నేను మెమో ఇచ్చి వారం దాటింది, నువ్వింకా సైకిల్ స్వయంగా తొక్కక ఎవడిచేతనో డబల్సు తొక్కించుకుంటున్నావా, సిగ్గు లేదూ? అంటూ.

విశృంఖలంగా తినేసి వెంట బయల్దేరాడు.


ఈ సైకిల్ తొక్కడమైనా రాని ఈ చవటతో నాకు కబుర్లేమిటన్నట్టుగా సర్వేశ్వర్రావుగారు అందరికంటే ముందు ఝుం మని వెడుతున్నాడు.

అసలే అధికారి; సైకిల్ ప్రవీణుడు. అందులో మాంచి సిమెంట్ రోడ్డు.

ఆఘమేఘాలమీద వెళ్ళిపోతున్నాడు.

మూడు మైళ్ళవరకు బాగానే వెళ్ళారందరూనూ.

ఇంతలోకే, ఎక్కణ్ణుంచొచ్చేడో వెంకన్నపాలెం వైపునుంచే, ఒక సైక్లిస్టు చకచకా అందర్నీ దాటుకుని ముందుకెళ్ళిపోతున్నాడు. ఓ పక్క బెల్ కొడ్తూ ఓ పక్క నోటితో సైడూ, సైడూ అని కేకలు పెడ్తూ మహా తొందరగా వెళ్తున్నాడు.




"ఎవడయ్యా వీడు? మన ఏ.డీ. గారి కంటే ఎక్స్‌పర్టులాగున్నాడు!" అని వాడి కంటా వెనక పడి వుండే. జోకులేసుకున్నారు, ఉద్యోగుల బృందం.

"అవునండి ఆడు గొప్ప కరోడా అండి. ఆడిది రాయిపురాజుపేటండి. తుంపాల పందార మిల్లులో పన్జేత్తన్నాడండి. ఆడు రోజూ యింతేనండి. ఆళ్ళూరికీ మిల్లుకీ ఆరుమైళ్లు తోవండి, పావుగంటలో ఎలిపోతాడండి." అని బంట్రోతొకడు సమాచారం అందించాడు.

ఆ క్షణం వాడు ఏ.డీ.గార్ని దాటేశాడు!

అంతే! ఏడీ గారికి వేడెక్కిపోయింది. ఇహ వాణ్ణి ఎలాగైనా దాటెయ్యాలని వేడెక్కి స్పీడెక్కాడు.

వాడొక్కసారి వెనక్కి తిరిగి చూసి, పరిస్థితి అర్థంచేసుకున్నాడు 'ఈయనగారెవరో ప్యాంటూ బుష్షర్టూ వేసుకుని— పన్నగా తనని దాటాలని చూస్తున్నాడు. వెనకాల పదిమందీ ఈనమనుషులే అయ్యుంటారు. తననిగాని దాటనిస్తే ఇంక పరువేముంది?'

అంతే. మాఇల్లో చెప్పని పందెం ప్రారంభమైంది.

అంత వేగాన్నీ నిదానంగా అట్టే పెట్టుకుని ఏ.డీ.గార్ని ఎప్పటికప్పుడు సరిగ్గా పదిగజాల దూరంలో వుంచేస్తూ వాడు ముందే వున్నాడు.

ఈయన వెనకే వున్నాడు. పుంజాలు తెంపుకుని తొక్కినా వాడి పరుగు అందుకోనే లేకపోతున్నాడు.

అలా మైలున్నర పాటు ఈయన్ని అలవగొట్టేసి-

ఎదర లారీ వస్తుంటే హఠాత్తుగా "సైడిచ్చేశాడు."

క్షణంలో సర్వే డిపార్టుమెంటు ఆఫీసర్ సర్వేశ్వర్రావుగారు ఇన్‌సూరెన్సువాళ్ళ డెబిట్ పద్దులో కెళ్ళిపోయేవాడే-

లారీవాడు సడెన్‌బ్రేక్ వెయ్యడం, సర్వేశ్వర్రావుగారు ఎడంపక్కకి తప్పుకోడంలో ఒక పెరుగుతట్ట ముసలావిడ మీదుగా రోడ్డుదిగి రోడ్డుప్రక్కని గడ్డిలో పడిపోడం జరిగిపోయాయి!...............

తుమ్మపాల గ్రామంలో గెజిటెడ్ ఆఫీసర్ గారి ఇనస్పెక్షన్ ఆగిపోయింది.

అనకాపల్లి డాక్టర్‌గారు ప్రాక్చరుందనీ, వైజాగ్ పెద్దాస్పత్రికి తీసుకెళ్ళమనీ చెప్పేశాడు!

* * *

"అయితే ఇప్పుడు తన సిబ్బందికందరికీ సైకిలింగ్ కంపల్సరీ అనిపట్టుపట్టడం లేదన్న మాట- మీ ఏ.డీ.గారు." అన్నాను హాస్పిటల్లో వార్డు దగ్గిర జీపు ఆపి.

"ఈ మూడు వారాల నుంచీ తన పొరపాటుకి ఎంత ఇదవుతున్నారో పాపం" అంటూ అప్పలస్వామితో సహా జీపు దిగారు సుబ్బారావుగారు

"సర్వేజనాః సుఖినోభవంతు!—" అనుకుంటూ జీపు వెనక్కి మళ్ళించాను.

[కీ॥ శే॥ కొమరవోలు నాగభూషణ రామారావుగారి జ్ఞాపకార్థం]